క్లుప్తంగా

వేణుగోపాలస్వామి ఆలయంలో రథసప్తమి పూజలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు స్వామి వారి మూలవరులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. గీతా భజన మండలి సభ్యులు విష్ణు సహస్ర నామాలు, హనుమాన్‌చాలీసా, సూర్యస్తోత్రాలను పారాయణ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారి జె.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

డైరీని ఆవిష్కరించిన చినజీయర్‌స్వామి



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై వార్షిక బ్రహ్మోత్సవాలను శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం నవ మల్లెతీగ మాసపత్రిక సంపాదకులు కమిలిశ్రీ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా 2025 డైరీని ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ వెంకటాచారి, వెంకటరమణ, రాఘవేంద్ర శేఖర్, ఆనంద్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో ఫ్రెండ్లీ పోలీస్ అమలు చేయాలి



తాడేపల్లిరూరల్: ప్రతి గ్రామంలోను సీసీ కెమెరాల నిఘాతో పాటు ఫ్రెండ్లీ పోలీస్ తప్పనిసరిగా అమలు చేయాలని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించి సీసీ కెమెరాలు, ఫ్రెండ్లీ పోలీస్‌పై విచారణ చేశారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ సీసీ కెమెరాల వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని, వాటిని అన్ని గ్రామాల్లో వినియోగంలోకి తీసుకువస్తే కేసులను త్వరితగతిన పరిష్కరించవచ్చని, ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ వలన గ్రామాల్లో ఏం జరుగుతోందో తెలుసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నార్త్‌జోన్ డీఎస్పీ మురళీకృష్ణ, మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు, దుగ్గిరాల ఎస్‌ఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు



తాడేపల్లిరూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ నేడు నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షుడు మోదుగుల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ దేశంలో 70 శాతం మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, వీరికి బడ్జెట్‌లో కేవలం 2.51 శాతం కేటాయించి కేంద్రం చేతులు దులుపుకుందని విమర్శించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.86 వేల కోట్లు కేటాయించడం దారుణమని, విద్య, వైద్య రంగానికి కూడా నిధులు కేటాయించకపోవడం బీజేపీ పరిపాలనా విధానానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా అన్ని మండల, గ్రామాల్లో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ తాడేపల్లి పట్టణ నాయకుడు బూరుగ వెంకటేశ్వరరావు, రైతు సంఘం మండల నాయకుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పల్లె కృష్ణ, రాజధాని రైతు సంఘం అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, టి.బక్కిరెడ్డి, కొండయ్య, హనుమంతరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

నూరు శాతం ఫలితాలే లక్ష్యం

- మార్చి 17 నుంచి పది పబ్లిక్ పరీక్షలు
- ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- పరీక్షలకు 451 మంది విద్యార్థులు



స్టడీ అవర్స్‌లో పదో తరగతి విద్యార్థులు

మేడికొండూరు : విద్యార్థి దశలో పదో తరగతి భవిష్యత్ దశ దిశను నిర్దేశిస్తుంది. భవిష్యత్ పునాదికి తొలిమెట్టు సరిగా పడితే జీవితం అంతా బాగుంటుందనేది తల్లిదండ్రుల అభిప్రాయం. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలనే ఆకాంక్ష విద్యార్థుల్లోనే కాకుండా ఉపాధ్యాయుల్లోనూ బలంగా ఉంటుంది. దీనికనుగుణంగానే టెన్త్ పరీక్షల కోసం సన్నద్ధం చేసేందుకు కసరత్తు మొదలుపెట్టారు. టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రభుత్వ, టాప్ జూనియర్ కళాశాలల్లో సీట్లు పొందడంతో పాటు, ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో రాయితీలు లభిస్తాయి. పదిలో మెరుగైన ఫలితాలు సాధనే లక్ష్యంగా చేపట్టిన 100 రోజుల ప్రణాళిక డిసెంబర్ నుంచి అమలు చేస్తుండగా వార్షిక పరీక్షలకు కేవలం 41 రోజులు మాత్రమే ఉండడంతో ఈ ప్రక్రియ మరింత శ్రద్ధతో నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక తరగతులు.. స్లిప్ టెస్టులు

పది విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ఉపాధ్యాయులు కృతనిశ్చయంతో పనిచేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు.. స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా వారిని గ్రూపులుగా విభజించి వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిని తీర్చిదిద్దడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించారు. మేడికొండూరు మండలంలో మొత్తం ఏడు పాఠశాలలు ఉండగా 451 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

టాప్ ర్యాంక్ లక్ష్యం



పాఠశాలలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం నిర్వహించే స్టడీ అవర్స్ ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఉపాధ్యాయులు సబ్జెక్టుల్లో ఏవైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేస్తున్నారు. టాప్ ర్యాంక్ లక్ష్యంగా కష్టపడి చదువుతున్నాం.

– వి.అక్షయ, విద్యార్థిని, జెడ్పీహైస్కూల్, మేడికొండూరు

గ్రూపులు వారీగా విభజించి విద్యార్థులకు బోధన



విద్యార్థులను గ్రూపులుగా విభజించి ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివిస్తున్నాం. దీని వలన విద్యార్థి అభ్యసన స్థితి ఉపాధ్యాయులకు అర్థమై సబ్జెక్టుల వారీగా సలహాలు సూచనలు అందిస్తున్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుంది.

– కె.జయప్రద, హెచ్‌ఎం, జెడ్పీహైస్కూల్, మేడికొండూరు

సిలబస్ రివిజన్‌కు అవకాశం



ఉదయం, సాయంత్రం రోజుకు ఒక సబ్జెక్టు చొప్పున ప్రత్యేక తరగతులతో సిలబస్ రివిజన్‌కు అవకాశం ఏర్పడింది. ప్రత్యేక తరగతులలో ఆయా సబ్జెక్టుల టీచర్లు అందుబాటులో ఉంటున్నారు. దీనికి తోడు సైన్స్ పరీక్ష రెండు రోజులు పాటు నిర్వహించడం బాగుంది.

– మహమ్మద్ నయ్యర్, విద్యార్థి, జెడ్పీహైస్కూల్, మేడికొండూరు

కచ్చితంగా 100 రోజులు ప్రణాళిక



పది పరీక్షల్లో ప్రతి ప్రభుత్వ పాఠశాల నూరు శాతం ఫలితాల దిశగా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు 100 రోజుల ప్రణాళికను కచ్చితంగా అమలు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న స్టడీ అవర్స్ విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. నూరు శాతం ఫలితాల దిశగా పనిచేస్తున్నాం.

– అబ్దుల్ అలీమ్, మేడికొండూరు ఎంఈఓ–2

యూనియన్ బ్యాంక్ శాఖ ప్రారంభం



యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రీమియం బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఈడీ పంకజ్ ద్వివేది

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రీమియం బ్రాంచ్‌ను మంగళవారం బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజ్ ద్వివేది ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పంకజ్ ద్వివేది మాట్లాడుతూ యర్రబాలెం పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారుల సౌలభ్యం కోసం ఈ శాఖను ప్రారంభించామని తెలిపారు. విజయవాడ జోన్‌లో ప్రీమియం బ్రాంచ్ ఇదే ప్రథమమని, కస్టమర్లు పలు రకాల డిపాజిట్‌లను ఉపయోగించుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ జోన్ ప్రీమియం బ్రాంచ్ హెడ్ సీవీఎస్ భాస్కరరావు, రీజనల్ హెడ్ ఎస్.జవహర్, మంగళగిరి క్లస్టర్ ఖాతాదారులు, ప్రాంతీయ కార్యాలయ అధికారులు, శాఖాధిపతులు, బ్రాంచ్ హెడ్ కె.బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

మణిపాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన



బెలూన్లు ఎగరవేస్తున్న విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, గుంటూరు ఎస్పీ సతీష్‌కుమార్



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు


తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మణిపాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మణిపాల్ ఎండీ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్సకు అవకాశం ఉంటుందని అన్నారు. గత 12 సంవత్సరాలుగా క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సు ఆంధ్రప్రదేశ్‌లోని పల్లె ప్రాంతాల్లో సేవలు అందిస్తోందని, సుమారు 50 వేల మందికి పైగా స్క్రీనింగ్ నిర్వహించామని, క్యాన్సర్‌ను తొందరగా గుర్తించి, సమయానికి చికిత్స అందించేలా చేయడమే లక్ష్యంగా చూస్తున్నామని వివరించారు. ఈ క్యాన్సర్ అవగాహన కార్యక్రమాన్ని ప్రముఖ వైద్యులు కృష్ణారెడ్డి, శ్రవణ్‌కుమార్, ధర్మేంద్ర, దినేశ్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీదివ్యలు ముందుండి నడిపించారని తెలిపారు. మణిపాల్ హాస్పిటల్ అంకాలజీ విభాగం డైరెక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్స చాలా అభివృద్ధి చెందిందని, ప్రస్తుతం ఆధునిక పరీక్షలు, ప్రత్యేక థెరపీలు మంచి ఫలితాలు అందిస్తున్నాయని అన్నారు. డాక్టర్ ధరేంద్ర మాట్లాడుతూ తొలి దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని అన్నారు. విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబు, గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, మణిపాల్ వైద్యులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

తాడేపల్లిరూరల్ : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలో అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్ ఆధ్వర్యంలో అవగాన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ మంగళగిరి పట్టణ పరిధిలోని రాజీవ్ గృహకల్ప, టిడ్కో గృహ సముదాయాల వద్ద ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, మార్కండేయ కాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో కరపత్రాలు అందజేసి క్యాన్సర్ నివారణ, క్యాన్సర్‌ను గుర్తించడం, చికిత్స తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించామని అన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మన చుట్టూనే నేరస్తులు ఉంటారు

- వారి కదలికలపై అవగాహన కలిగి ఉండాలి
- లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవికుమార్



మహిళలకు అవగాహన కల్పిస్తున్న లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవికుమార్


తాడేపల్లిరూరల్ : మన చుట్టూ నేరస్తులు మన కళ్లు గప్పి తిరుగుతుంటారు. చిన్న చిన్న ఘటనలే కదా అని నిర్లక్ష్యం వహిస్తే వెనుక పెద్ద పెద్ద నేరాలు చేస్తుంటారు. చేసిన నేరం గురించి పోలీసులకు తెలియజేస్తే విచారణ చేస్తామని గుంటూరు జిల్లా లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవికుమార్ అన్నారు. మంగళవారం రాత్రి గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని శివారు ప్రాంతాల్లోని మహిళలు, ఇతరులకు అవగాహన కార్యక్రమాన్ని గ్రూపులు వారీగా నిర్వహించారు. నులకపేటలోని కొండ శివారు ప్రాంతంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవికుమార్ మాట్లాడుతూ గుర్తుతెలియని వారు వచ్చి మద్యం తాగడం వంటి అసాంఘిక కార్యకలాపాలు చేస్తుంటారని, వాటిని పట్టించుకోకుండా ప్రతి రోజు జరుగుతుందని, ఎవరూ పట్టించుకోవడం లేదని అనుకోకుండా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగక ముందే గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. పోలీసులను కుటుంబ సభ్యులుగా భావించి, మీ ప్రాంతంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను తెలియజేస్తే ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నేరాలను అరికడతామని చెప్పారు. అనంతరం ఉండవల్లి, నులకపేట రహదారుల్లో తనిఖీలు నిర్వహించి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు, ఎస్‌ఐలు జేఎస్ఆర్, ఖాజావలి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం ఆయుష్మాన్ భారత్‌పై డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ గుంటూరు జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సి.విజయప్రకాష్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకు మనం పనిచేస్తున్నామని, ప్రభుత్వం నిర్వహించే ప్రతి ఆరోగ్య పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వారు వినియోగించుకునే విధంగా పనిచేయాలని, ఆయుష్మాన్ భారత్ ఉపయోగాలు ప్రజలకు తెలియజేసి, వినియోగించుకునే విధంగా చూడాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు శాంతకుమారి, ఎం.అనూష, సీహెచ్‌వో గురుకుమార్, బాలస్వామి, కె.శ్రీనివాసరావు, రమాదేవి, వైద్య మిత్ర కందుల సూర్యనారాయణ, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రైల్వే ఉద్యోగి



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల లాకుల వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైల్వే ఉద్యోగికి తీవ్రగాయాలు అయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం నంబూరు రైల్వే గేటు వద్ద గేట్‌మ్యాన్‌గా పనిచేస్తున్న రావిపాటి హేమంత్ అంగలకుదురులోని తండ్రి వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా దుగ్గిరాల లాకుల వద్ద మంగళగిరి వైపు నుంచి అతివేగంగా వస్తున్న టాటా మేజిక్ వాహనం రావిపాటి హేమంత్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో హేమంత్‌కు ఎడమకాలు పూర్తిగా విరిగి ఎముకలు బయటకు వచ్చాయి. సమాచారం అందుకున్న దుగ్గిరాల 108 సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి అక్కడే ప్రథమ చికిత్స నిర్వహించి ప్రత్యేక అనుమతితో రావిపాటి హేమంత్‌ను గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

కందిలో మరూకా మచ్చల పురుగు నివారణకు చర్యలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త వెంకటలక్ష్మి

తాడికొండ: కంది పంటలో ప్రస్తుతం ఆశిస్తున్న మారూకా మచ్చల పురుగు, కాయ ఈగ నివారణకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని లాం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త ఎం.వెంకటలక్ష్మి అన్నారు. మంగళవారం తుళ్ళూరు మండలం పెదపరిమి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కంది సాగులో సమగ్ర పంటల యాజమాన్యం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కంది పంట పూత, కాయ దశలో ఉందని ఈ దశలో ఆశించే మారూకా మచ్చల పురుగు, కాయ ఈగ వంటి తెగుళ్ల నివారణకు థయోడికార్బ్ 1గ్రా లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా లీటరు నీటికి కలిపి వారం రోజులకు ఒకసారి పిచికారీ చేసుకోవాలన్నారు. రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.శ్రీరంజని, వీఏఏలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రక్తహీనత లేకుండా తగు చర్యలు తీసుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు

ఫిరంగిపురం: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత లేకుండా ఆరోగ్య సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు అన్నారు. మండలంలోని రేపూడి హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను మంగళవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు డీపీహెచ్‌ఎన్‌వో ప్రియాంక, డీపీఎం సైమన్‌లు పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు సంబంధించిన సమాచారం ఉన్న పుస్తకాలు, యాప్‌లు వారు పరిశీలించారు. ఆర్‌సీహెచ్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. బడి ఈడు పిల్లలు పాఠశాలకు వెళుతున్నారా.. ఇంటివద్దనే ఉంటున్నారా.. అన్న విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులలో రక్తహీనత నివారణకు తీసుకుంటున్న జాగ్రత్తలు, వారికి అందజేస్తున్న మందులు వివరాలు సేకరించారు. అనంతరం ఫిరంగిపురం పీహెచ్‌సీలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. సకాలంలో ఆశా కార్యకర్తలు వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. సకాలంలో అనగా 12 వారాలలోపు యాంటినేటర్లను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు శ్వేత, సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ సువర్ణ, ఏఎన్‌ఎంలు వెంకగిణీ, శివకుమారి, ఆశా కార్యకర్తలు లక్ష్మి, రాణి, రత్నకుమారిలు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



సూర్యనారాయణ మూర్తికి పూజలు నిర్వహిస్తున్న చిన్న జీయర్‌స్వామి

తాడేపల్లిరూరల్ : రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి పర్యవేక్షణలో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ రథసప్తమి సందర్భంగా సామూహిక ఆదిత్య హృదయ స్తోత్ర పారాయణ, సూర్యప్రభ వాహన సేవ, ఉదయం 8 గంటలకు సుదర్శన హోమం, హంస వాహనంపై స్వామి వారి ఊరేగింపు, సాయంత్రం 6.30 గంటల నుంచి చంద్రప్రభ, కల్పవృక్ష వాహన సేవలు నిర్వహించామని, భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మహిళల్లో వస్తున్న క్యాన్సర్ సమస్యలపై అవగాహన కల్పించుటకై జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆశ్రమంలో చిన్న జీయర్‌స్వామి అవగాహన సదస్సు ఏర్పాటు చేసి స్త్రీలలో వచ్చే క్యాన్సర్ వల్ల కలిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేఎల్‌యూ, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల, విజయ ఇన్‌స్టిట్యూట్, రామకృష్ణ మిషన్ స్కూల్, బాపూజీ విద్యాలయ విద్యార్థినులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను తిరస్కరించండి



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న రైతు సంఘాల నాయకులు

తాడేపల్లిరూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను ఏపీ రైతు, వ్యవసాయ, కౌలు రైతు సంఘాల నాయకులు మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో గ్రామీణ ఉపాధి హామీ పథకానికి భారీగా కోతలు విధించారని, దీంతో పేదలు వలస వెళ్లే ప్రమాదం ఉందని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు భారీగా నిధులు తగ్గించడం అన్యాయమని, రైతులకు మద్దతు ధర కల్పించడంలోను, సబ్సిడీ ఇవ్వడంలోనూ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. రాజధానికి నిధులు కేటాయించకుండా మరోమారు రాష్ట్రాన్ని మోసం చేశారని, బడ్జెట్‌పై దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు, ప్రజా సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు, తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు అప్పలస్వామి, కాట్రాగడ్డ శ్రీనివాసరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిలో ఆలస్యంగా వెలుగు చూసిన చోరీలు



తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉండవల్లి, పెనుమాకలో రైతు పంట పొలాల్లో ఉల్లిగడ్డలను, నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌ల వద్ద ఫెన్సింగ్ బోర్డులను దొంగిలించిన ఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం ఉండవల్లికి చెందిన మణికంఠ అనే రైతు పంట పొలంలో ఉల్లిపాయలు కోసి గోతాలకు ఎత్తి పొలంలో భద్రపరచగా, గత నెల 29న ఆటోలో ఐదుగురు వ్యక్తులు వచ్చి 30 బస్తాల వరకు దొంగిలించారు. 30వ తేదీ పెనుమాక కరకట్ట డొంక రోడ్డులో మేక కృష్ణారెడ్డి అనే రైతు తన ఆరు ఎకరాల్లో ఉల్లిపాయలను కోసి మద్రాస్ తరలించేందుకు భద్రపరచగా రాత్రి 12 గంటల సమయంలో ఐదుగురు వ్యక్తులు వచ్చి 25 బస్తాల ఉల్లిగడ్డలు తీసుకుపోయారు. ప్రస్తుతం ఒక బస్తా రేటు రూ.1,250 ఉండగా ఒక రైతుకు రూ.37,500, మరో రైతుకు రూ.31,250 నష్టం వచ్చింది. పంట దొంగలపాలు కావడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఉండవల్లి సెంటర్‌లో నివాసముండే సెంట్రింగ్ మేస్త్రి శేఖర్ పోలకంపాడు పోలకమ్మ గుడి వద్ద ఓ ఇంటి నిర్మాణం చేస్తూ నాలుగు టన్నుల సెంట్రింగ్ బోర్డును నిర్మాణంలో ఉన్న ఇంట్లో భద్రపరిస్తే 31వ తేదీ అర్ధరాత్రి సమయంలో టాటా ఏస్ ఆటోలో వచ్చి అపహరించారు. కాయకష్టం చేసుకుని సెంట్రింగ్ బోర్డు పెట్టుకుంటే రూ.4 లక్షల విలువచేసే బోర్డు దొంగిలించుకుపోయారని శేఖర్ ఆవేదన చెందాడు. ఈ ఘటనలపై బాధితులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భావనారుషి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డీవీఆర్

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని సీతారాముల కోవెల వద్ద భావనారుషి కల్యాణ మహోత్సవం సందర్భంగా కమిటీ సభ్యులు మంగళవారం వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్)చేతుల మీదుగా భావనారుషి క్యాలెండర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జరిగే భావనారుషి కల్యాణ మహోత్సవానికి సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. రాత్రి నిర్వహించనున్న కల్యాణానికి హాజరు కానున్నట్లు కమిటీ సభ్యులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఊట్లపాల శ్రీనివాసరావు, పంచల వసంతకుమార్, తిరువీధుల శివవెంకట్, పాపారావు, జంజనం దుర్గారావు పాల్గొన్నారు.

భావనారుషి కల్యాణోత్సవం

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి పట్టణ పరిధిలోని సీతారామ కోవెల వద్ద వేంచేసియున్న భావనారుషి కల్యాణ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆయనను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చల రత్నకుమారి, యాక్టివిటీ సెక్రటరీ ఎం.సుధారాణి, మైనార్టీ నాయకుడు ఫిరోజ్, చేనేత సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజ్యలక్ష్మి, ఉండ్రు కళ్యాణ్, షణ్ముఖ్, కమిటీ సభ్యులు ఊట్లపాల శ్రీనివాసరావు, పంచల వసంతకుమార్, తిరువీధుల శివవెంకట్, పాపారావు, జంజనం దుర్గారావు పాల్గొన్నారు.